06-08-2023 ప్రాత:మురళి ఓంశాంతి "అవ్యక్త బాప్ దాదా" రివైజ్ 31-03-95 మధువనం

"పరమాత్మ మిలన మేళా యొక్క కానుకలు - కిరీటము, సింహాసనము మరియు తిలకము"

ఈ రోజు అనంతమైన తండ్రి తమ పిల్లలందరినీ అనంతములో చూస్తున్నారు. వారు అనంతమైన తండ్రి మరియు మీరందరూ కూడా అనంతమైన యజమానులు మరియు బాలకులు. బాప్ దాదా స్నేహీ సహయోగీ పిల్లలందరినీ చూసి హర్షిస్తున్నారు మరియు పిల్లలు తండ్రిని చూసి హర్షిస్తున్నారు. తండ్రికి ఎక్కువ సంతోషము ఉందా లేక పిల్లలకు ఎక్కువ సంతోషము ఉందా - ఏమంటారు? ఇద్దరికీ ఉంది! దీనినే పరమాత్మ మిలన మేళా అని అంటారు. మేళాలైతే ఎన్నో జరుగుతాయి కానీ పరమాత్మ మిలన మేళా ఒక్క సంగమయుగములోనే జరుగుతుంది. ఇది మొత్తము కల్పంలో జరుగదు. ఇప్పుడు జరుగుతూ ఉంది మరియు జరుగుతూ ఉంటుంది. మీ అందరికీ కూడా మేళా మంచిగా అనిపిస్తుంది కదా! బాప్ దాదా అయితే పిల్లల భాగ్యాన్ని చూసి హర్షితులవుతారు మరియు మనసులో - వాహ్ పిల్లలూ వాహ్ అన్న పాటను పాడుతారు. ఏ భాగ్యమైతే స్వప్నములో కూడా లేదో, సంకల్పములో కూడా లేదో, ఆ శ్రేష్ఠ భాగ్యము ఇప్పుడు సాకారములో అనుభవమవుతూ ఉంది. ప్రతి ఒక్కరి మస్తకముపై శ్రేష్ఠ భాగ్య రేఖ మెరుస్తూ ఉంది. అందరూ మెరుస్తూ ఉన్న సితారలే కదా? మీ ఈ శ్రేష్ఠ భాగ్యము స్మృతిలో ఉంటుంది కదా! ఎందుకని ఇది శ్రేష్ఠ భాగ్యము? ఎందుకంటే భాగ్య విధాత ద్వారా భాగ్యవాన్ ఆత్మలైన మీ యొక్క దివ్య బ్రాహ్మణ జన్మ జరిగింది. తండ్రిని కూడా భాగ్యవిధాత అని అంటారు మరియు బ్రహ్మను కూడా భాగ్యవిధాత అని అంటారు. మరియు మీ అందరి జన్మ బాప్ దాదా ద్వారా జరిగింది. కనుక ఎవరి తండ్రి అయితే స్వయం భాగ్యవిధాతనో వారి భాగ్యము ఎంత శ్రేష్ఠంగా ఉంటుంది! పరమాత్మ మిలనాన్ని జరుపుకుంటున్నారు కదా! (డబుల్ విదేశీయులతో) వీరు కూడా జరుపుకుంటున్నారు! అనంతమైన మేళాలో ఒకవేళ డబుల్ విదేశీయులు లేకపోతే దానిని అనంతమైనది అని అనరు. కనుక మీది కూడా విశేష పాత్ర, దానిని తండ్రి మరియు పిల్లలందరూ చూసి-చూసి హర్షిస్తారు. భాగ్యవిధాత ద్వారా జన్మ లభించటము - ఇది అన్నింటికన్నా నంబరువన్ భాగ్యము. అలాగే మొత్తము కల్పములో మరే జన్మలోనూ ఒక్క పరమాత్మయే తండ్రిగా కూడా అవ్వటము, శిక్షకునిగా కూడా అవ్వటము, సద్గురువుగా కూడా అవ్వటము మరియు సర్వ సంబంధాలను నిర్వర్తించటము - ఇటువంటి భాగ్యము సత్యయుగము నుండి కలియుగము వరకు ఎవరికైనా లభించిందా? ఇది ఇప్పుడు మీకు లభించింది! మా పాలన చేసేవారు స్వయం పరమాత్మ అని ఇప్పుడు మీరు నిశ్చయము మరియు నషాతో చెప్తారు. ప్రపంచములోనివారు పరమాత్మయే పాలన చేస్తున్నారు అని ఏదో మాట వరుసకు అంటారు కానీ ఇప్పుడు మీరు ప్రాక్టికల్ గా అనుభవముతో అంటారు - పరమాత్మయే తండ్రి మరియు ఆ తండ్రియే పాలన చేసేవారు, వారే పాలన చేస్తూ ఉన్నారు! ఈ నషా ఉంది కదా లేక కొద్ది-కొద్దిగా మర్చిపోతున్నారా? నడుస్తూ-నడుస్తూ మీ శ్రేష్ఠ భాగ్యాన్ని సాధారణంగా భావిస్తూంటారు, అది ఉండడము శ్రేష్ఠంగా ఉంది కానీ దానిని సాధారణంగా భావిస్తారు. అందుకే ఏ నషా మరియు సంతోషపు మెరుపు సదా ఉండాలో అది ఉండటం లేదు. నిజానికి ఒక్క సెకండు కూడా మర్చిపోలేరు కానీ - తండ్రి లభించారు, వారు మా వారిగా అయ్యారు, మేము కూడా తండ్రికి చెందినవారిగా అయ్యాము... దీనిని అంతటినీ సాధారణంగా భావిస్తారు. వారు మా వారు అన్నప్పుడు నషా ఉండాలి కదా? కానీ అది ఒక్కోసారి ఉన్నతంగా, ఒక్కోసారి మధ్యమంగా, ఒక్కోసారి సాధారణంగా అయిపోతుంది. ఆలోచించండి, మన తండ్రి పరమ ఆత్మ! అలాగే శిక్షకుడు కూడా డైరెక్టుగా పరమ ఆత్మ! ఏ శిక్షణను ఇచ్చారు? మిమ్మల్ని ఎలా తయారుచేసారు? త్రినేత్రి, త్రికాలదర్శి, త్రిలోకీనాథ్. ఇటువంటి చదువును ఎవరైనా చదువుతారా! ఇప్పటివరకు ఇటువంటి డిగ్రీ గురించి విన్నారా? జడ్జి, బ్యారిస్టరు, డాక్టరు, ఇంజినీరు ఈ డిగ్రీలన్నీ చూసారు కానీ త్రిలోకీనాథ్, త్రికాలదర్శి, త్రినేత్రి, నాలెడ్జ్ ఫుల్... ఇటువంటి డిగ్రీలు చూసారా? ద్వాపరం నుండి కలియుగం వరకు ఎవ్వరికైనా లభించాయా? మీకు లభించాయా? మీరు కూడా 63 జన్మలు తీసుకున్నారు కదా. ఇవి ఎవ్వరికీ లభించలేదు, లభించవు కూడా. మన శిక్షకుడు ఇటువంటివారు. సైన్సువారు సైన్సు పరంగా ఎంత ప్లాన్ చేసినా కానీ మూడు లోకాల వరకైతే చేరుకోలేరు. మూడు లోకాల జ్ఞానము ప్రాప్తించదు. కానీ మీలో అయితే 5 సంవత్సరాల పిల్లలు కూడా మూడు లోకాల జ్ఞానాన్ని ఇస్తారు! అది కూడా ఎంతో నషాతో చెప్తారు - అవును, సూక్ష్మవతనము ఉంది, మూల వతనము ఉంది. కావున పరమ ఆత్మ శిక్షకుడు కూడా. శ్రేష్ఠమైన శిక్షణతో ఈ డిగ్రీలను ప్రాప్తింపజేసారు కానీ ప్రపంచంలో అన్నింటికన్నా అతి పెద్ద పదవి రాజ్య పదవి. చదువు ద్వారా పదవి కూడా లభిస్తుంది కదా! మరి మిమ్మల్ని రాజుగా చేసారా? ఇప్పుడే రాజుగా ఉన్నారా లేక అలా అవ్వాలా? మీరు ఉన్నదేమో రాజులుగా కానీ కూర్చుంది నేలపై! పక్కా

ఇంట్లో కాదు, టెంటులో కూర్చున్నారు! చూడండి, శ్రేష్ఠాతి శ్రేష్ఠమైన పదవి రాజ్య పదవి. ఇప్పుడు కూడా స్వరాజ్య అధికారులుగా ఉన్నారు మరియు భవిష్యత్తులో కూడా విశ్వ రాజ్యాధికారులుగా అయ్యేదే ఉంది. ఇది పక్కా కదా? రాజ్యం ఎవరు చేయాలి? మీరు రాజ్యం చేస్తారా లేక మీపై వేరే రాజు ఎవరైనా రాజ్యం చేస్తారా? లేదు. వీరంతా ఇంతమంది రాజులుగా అవుతారు! ఇంతమంది రాజ్యం చేస్తారు! ప్రజలను కూడా తయారుచేసుకున్నారా లేక మీపై మీరే రాజ్యం చేస్తారా? కావున మీ భాగ్యాన్ని చూసుకోండి - పరమ ఆత్మ నా శిక్షకుడు, రాజ్య పదవిని ఇచ్చేవారు. అలాగే సద్గురువుగా అయ్యి... గురువు ఏమి చేస్తారు? మంత్రం ఇస్తారు కదా. మరి సద్గురువు ఏ మంత్రాన్ని ఇచ్చారు? మన్మనాభవ. సద్గురువు ద్వారా మహామంత్రము కూడా లభించింది మరియు సర్వ వరదానాలు కూడా లభించాయి. ఎన్ని వరదానాలు లభించాయి? వరదానాల లిస్టును చూడండి, ఎంత పెద్దగా ఉంది! రోజు వరదానము లభిస్తుంది కదా! అవి ఎంత సమయం నుండి లభిస్తున్నాయి! ఇన్ని వరదానాలను ఏ శిష్యునికీ ఏ గురువూ ఇవ్వనే ఇవ్వలేరు. ఇలా రోజు వరదానాలను ఇచ్చే సద్గురువును చూసారా? ఇప్పుడు నషా ఉంది కదా! (హాజీ) చాలా మంచిది. సదా ఉంచుకోండి. అంతే కానీ, ఇక్కడి నుండి బస్సులో వెళ్ళగానే నషా తగ్గిపోవడం మొదలవ్వకూడదు. ఇది సదా పెరుగుతూనే ఉండాలి.

బాప్ దాదా పిల్లలందరినీ సదా ప్రతి సబ్జెక్టులోనూ నంబరు వన్ గా చూడాలనుకుంటున్నారు. మరి నంబరు వన్ గా ఉన్నారా లేక ఇప్పుడింకా అవ్వాలా? నషాతో చెప్పండి - మేము అవ్వకపోతే ఇంకెవరు అవుతారు! విదేశీయులకు డబుల్ నషా ఉంది కదా! మంచిది. నా పిల్లలు ఒక్కొక్కరూ రాజా పిల్లలు, ప్రజలు కాదు అని తండ్రి కూడా సంతోషిస్తారు. ప్రజలైతే తర్వాత వస్తారు. ఈ మాత్రమైనా కలుసుకునేందుకు అవకాశం లభించినందుకు మీరు ఎంతైనా లక్కీ. టెంటులో ఉండాల్సి వస్తే ఏమయింది. మట్టిలోనైతే పడుకోవడం లేదు కదా, పరుపు మీదనే పడుకుంటున్నారు. బ్రహ్మా భోజనమైతే మంచిగా లభిస్తుంది కదా? మట్టి కలిసింది అయితే లభించడం లేదు కదా? ప్రేమగా తింటారు కదా? కొద్ది గొప్ప అయితే జరుగుతూనే ఉంటుంది, జరగాల్సిందే. ఎందుకని? మాయ మరియు ప్రభువు యొక్క ఆట కలిసి-కలిసి జరుగుతూ ఉన్నాయి. ఒకవేళ పరమాత్మతో మేళా జరిగితే మాయ కూడా గందరగోళం తప్పకుండా చేస్తుంది. మీ పని మేళా జరుపుకోవడం, దాని పని గందరగోళం చేయడము. కావున గందరగోళం కూడా జరిగింది, మేళా కూడా జరిగింది. (తుఫాను వచ్చింది అని ఎవరో చెప్పారు) ఏమీ పర్వాలేదు. మీది పురుషార్థపు తుఫాను మరియు అది గాలి తుఫాను. ఏమి జరుగుతుందో అని గాభరా పడటం లేదు కదా? వద్దు, తుఫాను వచ్చినా లేక వర్షము వచ్చినా, ఎంతటి అలజడి వచ్చినా కానీ మీ మనసు అయితే అచంచలంగా ఉంది కదా? మాతలు గాభరా పడలేదు కదా, టెంటు ఎగిరిపోయింది, ఏమి చేయాలి? కొద్ది-కొద్దిగా గాభరా పడ్డారా, ఏమవుతుందో, ఆరోగ్యం బాగుంటుందో లేదో అని గాభరా పడ్డారా? ఏది జరిగినా కానీ భక్తిలో ఉన్న ఎదురుదెబ్బలు, శ్రమకన్నా తక్కువే కదా. భక్తిలోని ఎదురుదెబ్బలనైతే తినడం లేదు కదా, ఆనందంలో ఉంటున్నారు కదా! మరి ఈ మేళా మంచిగా అనిపించిందా లేక గందరగోళాన్ని చూసి గాభరా పడ్డారా? లేదా, ఎవ్వరూ గాభరా పడలేదా? ఒకరిద్దరు అయితే గాభరా పడి ఉంటారు కదా? ఆనందంగా అనిపిస్తుందా? ఇంకో రెండు రోజులు ఉంచాలా? అచ్ఛా. బాప్ దాదా కూడా మాయ గందరగోళాన్ని చూసి చుట్టూ తిరిగి వస్తూ ఉంటారు. పిల్లలు ఏమి చేస్తున్నారు మరియు మాయ ఏమి చేస్తుంది అన్న ఆటను చూస్తారు.

బాప్ దాదాకు పిల్లల స్నేహము చూసి సంతోషంగా ఉంది. ఈ స్నేహమే మేళాను రచించింది. తండ్రికి కూడా స్నేహము ఉంది మరియు పిల్లలకు కూడా స్నేహము ఉంది, ఇద్దరూ కలిస్తే ఏమవుతుంది? మేళా. దృశ్యం కూడా ఎంత బాగా అనిపిస్తుంది. ఇంత పెద్ద పరివారము లభిస్తుంది అని ఎప్పుడైనా అనుకున్నారా మరియు ఇంత పెద్ద పరివారం ఎవరికి ఉంటుంది? మీకు ఎన్ని ఇళ్ళు ఉన్నాయి? (ఒకటి) మీ సేవా స్థానాలు ఎన్ని ఉన్నాయి? (అనేకము) వాటిని కూడా బాబా ఇల్లు అనే అంటారు కదా! మరి బాబా ఇల్లు అంటే మీ ఇల్లు. ప్రపంచము - మీరు ఇళ్ళు-వాకిళ్ళను వదిలేస్తారు అని అంటుంది కానీ మీరు ఎన్ని ఇళ్ళను తయారుచేసుకున్నారు! లెక్కపెట్టలేరు, గుర్తుంచుకోవాల్సి వస్తుంది. కావున ఇది వదలడం కాదు, తయారు చేసుకోవడం. అలాగే పరివారాన్ని విడిచిపెట్టారా లేక ఎంత పెద్ద పరివారాన్ని తయారుచేసుకున్నారంటే వారందరినీ కలవడమే కష్టమవుతుందా! మొత్తం బ్రాహ్మణులందరూ, ఎవరు ఎక్కడ ఉన్నా కానీ అందరూ ఒకే స్థానంలో కలవడం వీలవుతుందా? కష్టమవుతుంది కదా! ఎందుకంటే ఇది ఇతరుల రాజ్యం కదా, మీ రాజ్యమైతే కాదు! కానీ తండ్రి లభించారు, అనంతమైన పరివారం లభించింది. మరి అనంతమును గుర్తు చేస్తే అనంతమైన సంతోషము, అనంతమైన నషా ఉంటుంది. ఒకవేళ హద్దుగా భావిస్తే - నేను ఫలానా దేశంలో ఉంటాను, ఫలానా దేశస్థుడిని, ఫలానా జోనుకు చెందినవాడిని, ఇదంతా హద్దు అవుతుంది కానీ ఈ విధంగా గుర్తించడం కోసమని నిమిత్తమాత్రంగా చెప్తారు - ఇది ఫలానా జోను, ఇది ఫలానా స్థానము అని. కానీ స్వయాన్ని అయితే అనంతముకు

చెందినవారిగా భావిస్తారు కదా. నియమాలు కూడా పెట్టాల్సి ఉంటుంది. కొందరు ఇలా కూడా ఆలోచిస్తారు - ఇదేంటి బ్యాడ్జి పెట్టుకుంటేనే భోజనం లభిస్తుంది అని అంటున్నారు? మిమ్మల్ని భోజనం దగ్గర విసిగిస్తారు కదా? కానీ ఇదంతా చేయవలసి వస్తుంది ఎందుకంటే నియమములో లాభము ఉంటుంది. ఇది బంధనము కాదు కానీ విఘ్నాల నుండి నిర్బంధనులుగా చేసేందుకు సాధనము. ఇదేంటి కొత్త పద్ధతి పెట్టారు అని ఇలా ఆలోచించకండి. సంకల్పాలైతే తండ్రి వద్దకు చేరుకుంటాయి కదా. కానీ మర్యాదా పురుషోత్తములు మీరే కదా. లేక కేవలం పెద్ద దాదీలు మాత్రమే మర్యాదా పురుషోత్తములు మరియు మీరు ఫ్రీనా? మర్యాదా పురుషోత్తములు అనగా మర్యాదల లోపల ఉండేవారు, వాటి అనుసారంగా నడుచుకునేవారు. హాజీ పాఠం పక్కాగా ఉంది కదా? అచ్ఛా! ఎప్పుడైనా ఏదైనా విషయము జరిగితే అందులో హాజీ అంటారా లేక నాజీ అని కూడా అంటారా? ఇలాంటి విషయము ఏదైనా జరిగినప్పుడు ఒక్కోసారి హాజీ కి బదులు నాజీ అనడంలో ఎంత పక్కాగా ఉంటారంటే ఇక తండ్రి చెప్పినా కూడా వినరు. స్థాపన సమయంలో చిన్న-చిన్న పిల్లలు వచ్చినప్పుడు బాప్ దాదా వారికి పాఠాన్ని పక్కా చేయించడానికి ఎప్పుడూ ఈ విధంగా చెప్పేవారు - నా (కాదు) అని అనడమంటే నాస్తికులు, హా (సరే) అని అనడమంటే ఆస్తికులు. మరి మీరంతా ఎవరు? ఆస్తికులు. నాస్తికులైతే కారు కదా! అప్పుడప్పుడూ అవుతూంటారా? ఆట ఆడుతూంటారు! మాయ గురించి కూడా నాలెడ్జ్ ఫుల్ గా అయ్యారు! ఎందుకంటే మాయ కూడా నాలెడ్జ్ ఫుల్. పడవేయడంలో మాయ నాలెడ్జ్ ఫుల్ మరియు పైకి ఎగరడంలో మీరు నాలెడ్జ్ ఫుల్. ఎవరైనా ఎగరడంలో కొద్దిగా కింద-మీద అయితే మాయ చూసి దాడి చేస్తుంది. అయితే మీరు నాలెడ్జ్ ఫుల్ అయిన కారణంగా తెలుసుకుంటారు, ఓడిపోరు, విజయమాలను మెడలో వేసుకుంటారు. అందరి మెడలో విజయమాల ఉందా లేక అప్పుడప్పుడూ తీసేస్తుంటారా? అచ్ఛా.

వెనుక ఉన్నవారు ఆనందంలో ఉన్నారా? ఇది కూడా మధుబన్ ప్రాంతమే కదా, మరి మధుబన్ లో తప్ప ఇంకెక్కడైనా ఇంత పెద్ద మేళా జరుగగలదా? వీలవ్వదు కదా. కావున మధుబన్ అనంతమైన ఇల్లు. ఇక్కడంతా అనంతము, వేరే-వేరే స్థానాలలోనైతే ఎంతైనా అన్నీ చూసుకోవాల్సి వస్తుంది, కానీ ఇక్కడైతే సంకల్పం చేయగానే జరిగిపోతుంది. మరి అందరూ మీ భాగ్యము ద్వారా పరమాత్మ మేళాకు చేరుకున్నారు. ఎవరైతే ఈ కల్పంలో మొదటిసారి వచ్చారో, వారు చేతులెత్తండి. (సుమారుగా 13-14 వేల మంది సోదరీ-సోదరుల సభ ఉంది, అందులో చాలామంది కొత్త సోదరీ-సోదరులు ఉన్నారు). మంచిది, టి.వి.లో చూస్తున్నారు. ఇది కూడా చూడండి, మెజారిటీ సైన్సు సాధనాలన్నీ ఈ మధ్య కాలంలోనే వెలువడ్డాయి. కొన్ని సంవత్సరాల క్రితం ఈ సైన్సు సాధనాలు కూడా లేవు. మరి ఎవరి కోసం ఇవన్నీ వెలువడ్డాయి? మీ కోసం. బాప్ దాదా కూడా సైన్సు పిల్లలకు అభినందనలు తెలియజేస్తున్నారు ఎందుకంటే బాబా యొక్క పిల్లలు ఆ సాధనాలతో సుఖాన్ని పొందుతున్నారు కదా. మరి ఎంత బాగా అనిపిస్తుంది. కానీ బాప్ దాదా ఇప్పుడు ఏమి కోరుకుంటున్నారు? స్థాపన జరిగి ఎన్ని సంవత్సరాలు అయింది? డైమండ్ జూబ్లీ జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బాప్ దాదా ఇప్పుడు పిల్లలందరినీ రాజా పిల్లలు అని అన్నారు కదా, అందరూ రాజులే. రాజు సింహాసనాధికారిగా ఉంటారు కదా? రాజ్యానికి గుర్తు కిరీటము, సింహాసనము మరియు తిలకము. మరి బాప్ దాదా ఈ సంవత్సరము కొత్తవారైనా, పాతవారైనా సరే - ఒకవేళ ఎవరైనా కొత్తవారైనా సరే, సమాప్తి సమయము కొత్తవారికి కూడా సమీపంగా ఉంది, అలాగే పాతవారికి కూడా సమీపంగా ఉంది. బహుశా మాకు కూడా 60 సంవత్సరాలు లభిస్తాయి అని అనుకోకండి. లేదు, మీరు కవర్ చేసుకోవాలి. ఒకవేళ లాస్టులో వచ్చి ఉంటే ఫాస్టుగా వెళ్ళాలి. సంపన్నంగా అయ్యేందుకు, సమాప్తి సమయము అందరికీ ఒక్కటే, అందుకే కొత్తవారైనా లేక పాతవారైనా సరే, నేను స్వరాజ్య అధికారి ఆత్మను - అనే ఈ స్మృతి తిలకము సదా పెట్టబడే ఉంది. ఒకసారి తిలకము ఉండి, మరొకసారి తిలకము చెరిగిపోయి... అలా కాదు, రాజ్య అధికారి అనగా తిలకధారి - ఈ స్మృతి తిలకము అవినాశిగా ఉండాలి, సాధారణంగా కాదు. నేను తిలకధారిని, నేను విశ్వ కళ్యాణ బాధ్యత యొక్క కిరీటధారిని. ఇది ఎంత పెద్ద విశ్వము మరియు మీరందరూ విశ్వ కళ్యాణకారులు. కేవలం తండ్రి మాత్రమే విశ్వ కళ్యాణకారి కాదు, మీరందరూ తండ్రికి సహచరులు. కావున విశ్వ కళ్యాణ బాధ్యతా కిరీటధారులు మరియు సదా తండ్రి హృదయ సింహాసనాధికారులు. క్రిందకు దిగకండి. సదా సింహాసనాధికారి. మామూలుగా కూడా చూడండి, ఎవరైతే చాలా ప్రియంగా ఉంటారో, ప్రియమైన పిల్లలుగా ఉంటారో, వారిని తల్లిదండ్రులు మట్టిలోకి వెళ్ళనివ్వరు, నేలపై పాదం పెట్టనివ్వరు. మరి మీరెంత ప్రియమైన పిల్లలు! మీరు ప్రియమైన పిల్లలేనా లేక ఇంకా ఎవరో వచ్చేది ఉందా? మీరే కదా. మరి సింహాసనాన్ని విడిచి సాధారణ స్వరూపము, సాధారణ సంకల్పము... ఈ మట్టి లేక నేలపై అడుగు పెట్టకండి. బుద్ధి రూపీ పాదము సదా సింహాసనంపై ఉండాలి. పరమాత్మ అయిన తండ్రికి పిల్లలు మీరు. మహాత్మ, ధర్మాత్ములకు కాదు, పరమ ఆత్మకు పిల్లలు. ఇప్పుడైతే అందరూ నషాలో మంచిగా ఉన్నారు, అది కనిపిస్తుంది కానీ ఇది సదా ఉంటుంది కదా? లేక కొద్ది-కొద్దిగా ఉంటుంది, మళ్ళీ యుద్ధం చేస్తారు, ఆ తర్వాత విజయాన్ని పొందుతారు - ఇలా అయితే కాదు కదా? మీరు బ్రాహ్మణులా లేక

క్షత్రియులా? మీరు బ్రాహ్మణులు. క్షత్రియులు కాదా, యుద్ధం చేయరా? లేక ఒక్కోసారి బ్రాహ్మణులుగా అవుతారు మరియు ఒక్కోసారి క్షత్రియులుగా అవుతారా? ఒకవేళ మాయతో యుద్ధం చేయవలసి వస్తుంది అంటే క్షత్రియులు అయినట్లు. బ్రాహ్మణులు అనగా విజయీ మరియు క్షత్రియులు అనగా యుద్ధం చేసేవారు. బాప్ దాదాకు అప్పుడప్పుడు పిల్లలపై చాలా దయ కలుగుతుంది, కూర్చునేది యోగములో కానీ చేసేది యుద్ధము! ఒక గంట యోగం చేసాము అని అంటారు కానీ ఒక్క గంటలో యుద్ధం ఎంత సమయం జరిగింది మరియు యోగం ఎంత సమయం ఉంది? ఒకవేళ ఏ కారణం చేతనైనా అనుభూతి కలగడం లేదంటే తప్పకుండా యుద్ధం చేసే స్థితి ఉన్నట్లే. బాప్ దాదా అంటారు - మీరు యోగీ పిల్లలు కానీ యోధులైన పిల్లలుగా అవుతారు! ఎప్పటివరకు యుద్ధం చేస్తారు? అంతిమం వరకు యుద్ధం చేస్తారా? యుద్ధం చేయండి - అని అనుమతిని ఇవ్వమంటారా? అనుమతి కావాలా? వద్దా? మరి ఎందుకు చేస్తారు? బలహీనంగా అయినప్పుడు మాయ ఎంతగా ఆధీనులుగా చేస్తుందంటే మీరు వద్దనుకున్నా కానీ యుద్ధం చేస్తారు. ఏ విధంగానైతే కొంతమంది పనివాళ్ళు చాలా అమాయకంగా ఉన్నప్పుడు యజమాని వారిని ఆధీనం చేసుకుంటారు, ఆ పనివాడు చేయలేని పనిని కూడా యజమాని - నీవు చెయ్యి, లేకపోతే ఉద్యోగం ఎందుకు చేస్తున్నావు అని అంటారు. మాయ కూడా అలాగే చేస్తుంది, మీరు వద్దనుకుంటారు కానీ బలహీనంగా ఉన్న కారణంగా మాయకు ఆధీనులుగా అవ్వవలసి ఉంటుంది. మరి ఆ సమయంలో మీరు యోగీలా లేక యోధులా? యోగీ అనైతే అనలేము కదా? మరి బాప్ దాదా ఇదే కోరుకుంటున్నారు - పిల్లలు ప్రతి ఒక్కరూ యోగీ పిల్లలుగా ఉండాలి, యోధులుగా కాదు. బాప్ దాదాకు పిల్లలు చేసే యుద్ధం యొక్క శ్రమ మంచిగా అనిపించదు. పరమాత్ముని పిల్లలైతే సదా ఉత్సాహంలో ఉండేవారు, ఆనందంలో ఉండేవారు, యుద్ధం యొక్క శ్రమ చేసేవారు కాదు. మరి ఎలా తయారవుతారు? యోగీ పిల్లలుగానా లేక యోధులైన పిల్లలుగానా? యోగీగా అవుతారా లేక కొద్ది-కొద్దిగా యుద్ధం చేయడం మంచిగా అనిపిస్తుందా? చెప్పేటప్పుడు అవును, అవును అని అంటారు, కానీ చేసేటప్పుడు ఫోటో తీయడం జరుగుతుంది. కావున ఈ సంవత్సరము అందరి చార్టు ఈ విధంగా ఉండాలి - సదా రాజ్యాధికారి, ఆధీనత సమాప్తము. అచ్ఛా.

అన్ని వైపులా ఉన్న దేశ-విదేశాలలోని సూక్ష్మ స్వరూపంతో దృశ్యాన్ని చూసే సర్వ ఆత్మలకు, నలువైపులా ఉన్న సదా శ్రేష్ఠ పాలనతో పాలించబడేవారికి, శ్రేష్ఠ చదువుతో రాజ్య పదవిని పొందే ఆత్మలకు, సద్గురువు ద్వారా సర్వ వరదానాలను ప్రాప్తి చేసుకునే ఆత్మలకు, సదా మాయాజీత్ విజయీ రత్నాలకు, సదా యుద్ధాన్ని విడిచిపెట్టి రాజయోగీ స్థితిలో స్థితులై ఉండే సర్వ శ్రేష్ఠ ఆత్మలకు బాప్ దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

వరదానము:- ఏకాంతము మరియు ఏకాగ్రత యొక్క అటెన్షన్ ద్వారా తీవ్రగతితో సూక్ష్మ సేవను చేసే సత్యమైన సేవాధారీ భవ

దూరముగా కూర్చుని ఉన్నా అనంతమైన విశ్వములోని ఆత్మల సేవను చేసేందుకు మనసు మరియు బుద్ధి సదా ఫ్రీగా ఉండాలి. చిన్న-చిన్న సాధారణ విషయాలలో మనసు మరియు బుద్ధిని బిజీ చెయ్యకండి. తీవ్రగతితో కూడిన సూక్ష్మ సేవ కొరకు ఏకాంతము మరియు ఏకాగ్రతల పట్ల విశేషమైన అటెన్షన్ పెట్టండి. బిజీగా ఉన్నా కానీ మధ్య-మధ్యలో ఒక ఘడియ, రెండు ఘడియల సమయాన్ని కేటాయించి ఏకాంతాన్ని అనుభవము చేయండి. బయటి పరిస్థితులు అలజడితో కూడినవిగా ఉన్నా కానీ మనసు-బుద్ధిని ఏ సమయంలో కావాలనుకుంటే ఆ సమయంలో ఒక్కరి అంతములో క్షణములో ఏకాగ్రము చేయండి, అప్పుడు సత్యమైన సేవాధారులుగా అయ్యి అనంతమైన సేవకు నిమిత్తులుగా అవ్వగలరు.

స్లోగన్:- ఎవరైతే జ్ఞానము యొక్క ప్రతి రహస్యాన్ని అర్థం చేసుకుని రహస్యయుక్తముగా, యుక్తియుక్తముగా మరియు యోగయుక్తముగా ఉంటూ కర్మలు చేస్తారో, వారే జ్ఞానయుక్త ఆత్మలు.